నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, శుక్రవారం 16 మే 2025 RANGAREDDY



ధాన్యాన్ని తూకం వేస్తున్న కొనుగోలు కేంద్రం సిబ్బంది

# కొనుగోళ్లు ప్రారంభం

'కొనుగోళ్లు లేక రైతన్న దిగాలు'కు స్పందించిన అధికారులు

పెద్దేముల్, మే 15 : మండలంలోని జనగాం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు జరగని వైనంపై 'కొనుగోళ్లు లేక రైతన్న దిగాలు' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లను ప్రారంభించడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో మొత్తం ధాన్యాన్ని సేకరిస్తామని డీసీఎంఎస్ అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

## పాత బోరులో కొత్త మోటర్ బిగింపు

నమస్తే ఎఫెక్ట్



చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లి మండలంలోని ఆలంఖాన్‌గూడ వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని 'తాగునీటికి తండ్లాట' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ నీరు సరిపడా సరఫరా కాకపోవడంతో గ్రామంలో ఉన్న పాత బోరులో కొత్త మోటర్‌ను దింపి నీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

# 15 రోజుల్లో చెల్లించాలి

- సిద్ధాపూర్ అసైన్డ్ భూముల అక్రమార్కులకు నోటీసులు
- 315 ఎకరాల అసైన్డ్ భూమిని టీఎస్ఐఐసీకి కేటాయించిన అప్పటి ప్రభుత్వం
- 90 ఎకరాల మిగులు భూమికి నకిలీ పత్రాలు సృష్టించి పరిహారాన్ని కాజేసిన బోగస్ రైతులు
- ఒక్కో ఎకరాకు రూ.10 లక్షల చొప్పున..
- బోగస్ రైతులు 70 మంది వరకు ఉంటారని గుర్తించిన రెవెన్యూ అధికారులు



కొత్తూరు, మే 15 : సిద్ధాపూర్ అసైన్డ్ భూముల్లో బోగస్ పత్రాలు సృష్టించి పరిహారం పొందిన రైతుల నుంచి ఆ డబ్బుల వసూలుపై రెవెన్యూ శాఖ దృష్టి సారించింది. అక్రమంగా పరిహారం పొందిన వారిని గుర్తించి రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. 15 రోజుల్లో తీసుకున్న డబ్బులను తిరిగి చెల్లించాలంటూ ఇంటింటికీ తిరిగి చెబుతున్నారు.

### 90 ఎకరాల మిగులు భూమిపై అక్రమార్కుల కన్ను

గతంలో మండలంలోని సిద్ధాపూర్‌లో 252, 278, 361 సర్వేనంబర్లలోని 314 ఎకరాల అసైన్డ్ భూమిని ప్రభుత్వం టీఎస్ఐఐసీ కేటాయించింది. రికార్డులు ఉన్న ఒక్కో రైతుకు ఎకరానికి రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించింది. అయితే, అందులో 224 ఎకరాల అసైన్డ్ భూమి రైతుల పేరుపై ఉండగా.. మిగిలిన 90 ఎకరాల భూమికి గ్రామంలోని కొందరు అక్రమార్కులు రెవెన్యూ అధికారుల ద్వారా నకిలీ పత్రాలు సృష్టించి.. వారు కూడా ఎకరాకు రూ.10 లక్షల చొప్పున పరిహారాన్ని కాజేశారు.

### అక్రమార్కులకు నోటీసులు

అయితే నకిలీ పత్రాలను సృష్టించి పరిహారాన్ని కాజేసిన రైతులు సుమారుగా 70 మంది వరకు ఉంటారని సమాచారం. వారిలో 15 మందికి గురువారం నోటీసులు అందజేసినట్లు, మిగిలిన వారికి రెండు, మూడు రోజుల్లో పంపిణీ చేస్తామని కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

# నకిలీ పత్రాలతో ప్లాట్ కాజేసే యత్నం

- గుర్తించి అడ్డుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్
- కేసు నమోదు.. ఇద్దరి అరెస్టు.. పరారీలో నలుగురు



ప్రధాన నిందితుడు భాస్కర్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట, మే 15 : మృతి చెందిన వ్యక్తి ప్లాట్ కాజేసేందుకు కొందరు మోసగాళ్లు నకిలీ ఆధార్‌కార్డులు సృష్టించారు. ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు యత్నించగా అబ్దుల్లాపూర్‌మెట్ సబ్‌రిజిస్ట్రార్ సునీతారాణి పసిగట్టి.. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం..గోషామహల్‌కు చెందిన చంద్రకాంత్ అనే వ్యక్తి మనకర్ ఆనంద్‌కు మండలంలోని మజీద్‌పూర్‌లో 267 గజాల స్థలం హక్కులపై జీపీఏ ఇచ్చాడు. అయితే ఆనంద్ గతంలోనే మరణించాడు. ఈ విషయాన్ని గుర్తించిన చంపాపేటలో నివసిస్తున్న కొసిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆ స్థలాన్ని కాజేయాలని ప్లాన్ చేశాడు. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా గోనకోల్‌కు చెందిన బోదాసు ఆంజనేయులును ప్లాట్ యజమాని ఆనంద్‌గా చూపించేందుకు నకిలీ ఆధార్‌కార్డును సృష్టించాడు. అదే సమయంలో వరంగల్‌లోని బలపాలకు చెందిన జిల్లాపల్లి సంజీవరావును చంద్రకాంత్‌గా చూపించేలా మరో ఆధార్‌కార్డును సృష్టించాడు. సాక్షులుగా గోనకోల్‌కు చెందిన దండుగల ఆంజనేయులు, చంపాపేటలో ఉంటున్న కురువ శ్రీనివాసులును తీసుకెళ్లాడు. వారి నుంచి భాస్కర్‌రెడ్డి కొంటున్నట్లు డాక్యుమెంట్‌నూ సిద్ధం చేయగా.. ఇందుకు డాక్యుమెంట్ రైటర్ ఉదయ్‌కుమార్ సహకరించాడు. అయితే, బుధవారం రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్‌కార్డు నంబర్ల నమోదు సమయంలో బయోమెట్రిక్ సరితూగలేదు. బయోమెట్రిక్ సమయంలో ఆనంద్ పేరుతో ఉన్న ఆధార్‌కార్డు నంబర్‌ను ఎంట్రీ చేయగా.. ఆంజనేయులు పేరు, చంద్రకాంత్ పేరిట ఉన్న ఆధార్‌కార్డును నమోదు చేయగా సంజీవరావు పేర్లు రావడంతో సబ్‌రిజిస్ట్రార్ సునీతారాణి అనుమానించారు. మోసం జరుగుతున్నట్టు గుర్తించారు. సబ్‌రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఏ1గా ఉన్న భాస్కర్‌రెడ్డి, ఏ6 శ్రీనివాసులును అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్టు తెలిపారు.

# బిర్యానీలో బల్లి..



- ఇబ్రహీంపట్నం మెహఫిల్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో ఘటన..
- డయల్ 100కు కాల్.. రంగంలోకి పోలీసులు.. కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, మే 15 : ఇబ్రహీంపట్నంలోని ఓ రెస్టారెంట్‌లో కస్టమర్ తింటున్న బిర్యానీలో బల్లి దర్శనమిచ్చింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ గ్రామానికి చెందిన గుజ్జా కృష్ణారెడ్డి అనే వ్యక్తి గురువారం మధ్యాహ్నం బిర్యానీ తినేందుకు సాగర్ రహదారిలోని మెహఫిల్ రెస్టారెంట్‌కు వెళ్లాడు. కాగా, ఆయన తింటున్న చికెన్ బిర్యానీలో బల్లి కనిపించడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడు రెస్టారెంట్ యజమానిని ప్రశ్నించాడు. ఏమైతుంది. బల్లి మంచిగా ఫ్రై అయ్యిందిగా తిను అంటూ నిర్లక్ష్యంగా సమాధాన మిచ్చాడు. రెస్టారెంట్ యజమాని కృష్ణారెడ్డితో ఏమి చేసుకుంటావో చేసుకో అనే విధంగా మాట్లాడడంతో వెంటనే అతడు డయల్ 100కు ఫోన్ చేశాడు. రెస్టారెంట్ వద్దకు చేరుకున్న పోలీసులు వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. దీంతో అప్రమత్తమైన రెస్టారెంట్ యజమాని దానికి తాళం వేసి పరారైనట్లు సమాచారం.

# మోస్తరు వానలు పడొచ్చు..

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లో రెండు రోజులుగా వానలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం నగరంలోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి ఏడు గంటల వరకు లంగర్‌హౌస్‌లో 3.0 సెం.మీలు, కార్వాన్‌లో 2.35 సెం.మీలు, ఆసిఫ్‌నగర్‌లోని అల్లబండలో 2.28 సెం.మీలు, కిషన్‌బాగ్‌లో 2.15 సెం.మీలు, పాతబస్తీ దూద్‌బౌలిలో 1.83 సెం.మీలు, జియాగూడ, షేక్‌పేట, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో 1.50 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఆవర్తనం, ద్రోణి ప్రభావం కొనసాగుతుండడంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 35.6, కనిష్ఠం 22.8 డిగ్రీలు, గాలిలో తేమ 43శాతంగా నమోదైనట్లు వివరించారు.

రెక్కల కష్టం నీటిపాలు

# అన్నదాత ఆగమాగం..

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- భారీ వర్షం, ఈదురుగాలులకు కొట్టుకుపోయిన కేంద్రాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం
- చేతికొచ్చిన పంట నష్టపోవడంతో ఆందోళనలో రైతులు
- ధాన్యాన్ని కొనడంలేదని దోమ మండల కేంద్రంలో ధాన్యం సంచుల్ని రోడ్డుపై పడేసి నిరసన తెలిపిన అన్నదాత



కులకచర్ల మార్కెట్ యార్డులో తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

వికారాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ) : ఆరుగాలం కష్టపడి పండిస్తున్న రైతన్నకు నష్టాలే మిగులుతున్నాయి. ఓ వైపు ప్రభుత్వ నిర్లక్ష్యం.. మరోవైపు అకాల వర్షాలతో కన్నీళ్లే మిగులుతున్నాయి. గత వారం, పదిహేను రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం అంటూ అన్నదాత నుంచి ధాన్యాన్ని కొనేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. బుధవారం రాత్రి, గురువారం ఉదయం కురిసిన వర్షానికి జిల్లాలోని కొనుగోలు కేంద్రాల వద్ద, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. ధారూరు, దోమ, కులకచర్ల మండలాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించేందుకు అంతా సిద్ధం చేసి గన్నీ బ్యాగుల్లో నింపిన తర్వాత ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో మళ్లీ ఆరబెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. అదేవిధంగా కొన్ని చోట్ల రోడ్లపై ఆరబోసిన ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. అకాల వర్షంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతన్న పుట్టెడు దుఃఖంతో ధాన్యం గింజలను ఒక్క దగ్గరికి కుప్పగా పోస్తున్నాడు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబెట్టుకున్న పరిస్థితి కూడా మరీ దారుణంగా తయారైంది. తేమ శాతం ఎక్కువగా ఉందంటూ తూకం వేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఇప్పటికే పది రోజులుగా ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులకు గత రెండు రోజులుగా కురిసిన వర్షంతో వడ్లు తడిసిపోవడంతో మరోవారం రోజులపాటు అక్కడే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితులుండడంతో ఇంటిల్లిపాది ధాన్యాన్ని ఆరబెట్టి రోడ్ల పక్కనే జాగారం చేస్తున్నారు. చేతికొచ్చిన పంట నష్టపోతుండడంతో ప్రభుత్వం ఆదుకోవాలని, తేమ శాతం అంటూ కొర్రీలు పెట్టకుండా కొనాలని డిమాండ్ చేస్తున్నారు.

### దళారుల వద్దకు ధాన్యం..

కేసీఆర్ హయాంలో ప్రతి గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి అన్నదాతకూ మద్దతు ధర అందించేలా చర్యలు చేపడితే.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ మాత్రం రైతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అన్యాయం చేస్తున్నది. జిల్లాలో యాసంగి వరి కోతలు పూర్తై నెల రోజులు కావొస్తున్నా ధాన్యం సేకరణలో సర్కార్ తీవ్ర జాప్యం చేస్తున్నది. కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన ధాన్యాన్ని తేమ శాతం ఎక్కువగా ఉందంటూ తూకం వేయకపోవడంతో అన్నదాతలు అక్కడే ఆరబెట్టుకొని పడిగాపులు కాస్తున్నారు.

మరోవైపు కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లిన ధాన్యాన్ని 10-15 రోజులు అవుతున్నా కాంటా చేయకపోవడంతో విసుగు చెందిన జిల్లా రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముతూ నష్టపోతున్నారు. ఏదో ఒక కొర్రీ పెడుతూ గత వారం రోజులుగా తూకం వేయకపోవడంతో ఆగ్రహం చెందిన రైతులు బుధవారం రాత్రి దోమ మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రం ఎదుట రోడ్డుపై ధాన్యం సంచుల్ని పడేసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట కిలోల కొద్ది తీస్తూ నట్టేట ముంచుతున్నారని పలువురు రైతులు మండిపడుతున్నారు. ఒక క్వింటాలో పది కిలోల వరకు తరుగు తీస్తూ దోపిడీ చేస్తున్నారని పేర్కొంటున్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే కొర్రీలు పెడుతూ నష్టం కలిగిస్తుండడంతో ప్రైవేట్ వ్యాపారులు, దళారులను రైతులు ఆశ్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవకతవకలతోపాటు సమస్యలపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### తడిచిన ధాన్యాన్నీ సేకరించాలి..



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరగా సేకరించకపోవడంతో అకాల వర్షాలకు తడిసిపోతున్నాయి. అక్కడ టార్పాలిన్లు అందుబాటులో ఉండక.. రైతన్నకు తీవ్ర నష్టం జరుగుతున్నది. తడిచిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టేందుకు అన్నదాత మరో వారం పాటు అక్కడే ఉండాల్సిన దుస్థితి నెలకొన్నది. అన్నదాతల ఇబ్బందులను గుర్తించి తడిచిన ధాన్యాన్ని కూడా సేకరించి, ఆదుకోవాలి.

-మల్లేశ్‌గౌడ్ తుంకిమెట్ల, బొంరాస్‌పేట

### వడ్లను ఎప్పుడు కొంటారు..



వడ్లను ఎప్పుడు కొంటారో తెలియడం లేదు. గత 15 రోజులుగా ఇబ్బంది పడుతున్నాం. వర్షం వస్తే టార్పాలిన్లు కప్పుతూ.. తగ్గాక తీస్తున్నాం. ఇక్కడే నిరీక్షించాల్సి వస్తున్నది. అంతేకాకుండా ప్రతిరోజూ కూలీలతో పనులు చేస్తుండడంతో ఆర్థికంగా భారంగా మారుతున్నది. ధాన్యం కొనుగోళ్లను ఒకే కాంటాతో చేస్తుండడంతో చాలా ఇబ్బందిగా ఉన్నది. అధికారులు స్పందించి కాంటాల సంఖ్యను పెంచాలి.

-గోరప్ప, రైతు నాగసముందర్ గ్రామం, ధారూరు

### గత 15 రోజులుగా వడ్ల కుప్పల వద్దే..



గత 15 రోజులుగా రోడ్ల పైనే ఉంటూ నిద్ర లేని రాత్రులను గడుపుతున్నాం. ఇంకా ఎప్పుడు తమ ధాన్యాన్ని కొంటారు. ఒకవైపు అకాల వర్షాలతో వడ్లు తడిసిపోతాయేయోననే భయంగా ఉన్నది. అయినా వడ్లను సేకరించడం లేదు.- రాములమ్మ నాగసముందర్ గ్రామం, ధారూరు

### వడ్లు తడుస్తున్నాయ్..



బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పరిధుల్లో అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యాన్ని రోడ్లు, కల్లాల్లో ఆరబెట్టి తీసుకొస్తే కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో అకాల వర్షాలతో వడ్లు తడిసిపోయే ప్రమాదం ఉన్నది. అందువల్ల వచ్చిన ధాన్యాన్ని తూకం వేయాలి. కొనుగోళ్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి.

-హన్మంతు నాగిరెడ్డిపల్లి, బొంరాస్‌పేట

# కొనుగోళ్ల తీరుపై అన్నదాత అసహనం

### ధాన్యం బస్తాలను రోడ్డుపై గుమ్మరించి నిరసన



దోమ చౌరస్తాలో రోడ్డుపై ధాన్యం బస్తాలను వేసిన రైతు పరమేశ్

దోమ : మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో గత వారం రోజులుగా కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడంతో పరమేశ్ అనే రైతు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ తన ధాన్యాన్ని ఓ ట్రాక్టర్‌లో తీసుకొచ్చి దోమ చౌరస్తాలో గుమ్మరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొనుగోళ్లను సక్రమంగా చేపట్టాలని నిరసనకు దిగిన రైతులను పోలీసులు రంగ ప్రవేశం చేసి శాంతింపజేశారు. సివిల్ సప్లయ్ రవాణా టెండర్లలో అధికారులు నిబంధనలు పాటించక పోవడం, కొనుగోలు కేంద్రాలకు లారీలు సక్రమంగా రాకపోవడం తదితర కారణాలతో ఈ దుస్థితి నెలకొన్నదని అన్నదాతలు పేర్కొన్నా రు. కొనుగోళ్లు ఆలస్యం అవుతుండడంతో అకాల వర్షాలతో కేంద్రాల వద్దకు విక్రయించేందుకు తీసుకొచ్చిన ధాన్యం బస్తా లు మొలకెత్తి రైతులకు తీవ్ర నష్టం జరుగుతున్నదని మండిపడ్డారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు రాజిరెడ్డి మాట్లాడుతూ.. అధికారులు మిల్లర్లతో కుమ్మక్కై ధాన్య తరలించడం లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.



దోమలో కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం బస్తాలు



నాగసముందర్‌లోని కొనుగోలు కేంద్రంలో తూకం కోసం సిద్ధంగా ఉన్న ధాన్యం

# దారిపొడవునా ధాన్యం బస్తాలు

ధారూరు : అన్నదాతలు గత ఇరవై రోజులుగా మండలంలోని నాగసముందర్ గ్రామంలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చి ఆరబెట్టి ఎప్పుడు కొంటారని ఎదురుచూస్తున్నారు. ఒక్క టే కాంటా ఏర్పాటు చేయడంతో అక్కడికి పలు గ్రామాలకు చెందిన రైతులు వడ్లను తీసుకురావడంతో దారిపొడవునా ధాన్యం బస్తాలే కనిపిస్తున్నాయి. అకాల వర్షాలతో వడ్లు తడిసిపోతాయేమోనని ఆందోళన చెందుతున్నారు.

### ధాన్యాన్ని కొనాలి..



ధాన్యాన్ని త్వరగా కొనాలి. గత రెండు వారాలుగా ఎప్పుడు కొంటారా.. అని ఎదురుచూస్తున్నాం. అకాల వర్షాలు కురుస్తుండడంతో సంచుల్లో నింపిన ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉన్నది. -సాయిప్రసాద్, నాగసముందర్

## కొనుగోళ్లలో ఆలస్యం

# తడిసిన ధాన్యం..

కులకచర్ల : మండల కేంద్రంలో బుధవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి కులకచర్ల మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేం ద్రంలోని ధాన్యం తడిసి పోయింది. దీంతో గురువారం రైతులు మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఎండకు ఆరబెట్టారు. కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం ఎప్పటికప్పుడు కొంటే తమ పంట తడిచిపోయేది కాదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కల్లాల్లోనే ధాన్యం..

కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని అధి కారులు తూకం వేయకపోవడంతో అక్కడే ఉంటు న్నాయి. అంతేకాకుండా కొన్ని కేంద్రాల్లో గన్నీబ్యాగుల సమస్య కూడా అన్నదాతలను వేధిస్తున్నది. సరిపడా సంచులు రాకపోవడంతో రైతులు తమ వడ్లను కల్లాలు, రోడ్లపైనే ఆరబెట్టి..రాత్రింబళ్లు అక్కడే పడిగాపులు కాస్తున్నారు.

### లారీలు రావడం లేదు.. ధాన్యం బస్తాలు రైస్‌మిల్లులకు తరలడం లేదు..



కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యాన్ని కాంటా వేసి నిల్వ చేశారు. వడ్లను తీసుకెళ్లేందుకు లారీలు రావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించకపోవడంతో తమ ధాన్యానికి ఓపీఎంఎస్ నమోదు చేయడంలేదు. దీంతో సమయానికి డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమకావు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు చాలా ఉన్నాయి. అధికారులు స్పందించి రైస్‌మిల్లులను తరలించాలి. బుధవారం కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలి.

-నాగని బిచ్చయ్య, రైతు కులకచర్ల



కులకచర్ల మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు